క్లుప్తంగా

ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించాలి

మరికల్: కోయిల్‌సాగర్‌లో నుంచి ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించాలని భవన నిర్మాణ కార్మికులు గోపి, కుర్మన్న, ఆంజనేయులు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారులు ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించకపోవడంతో ఇసుక కొరత కారణంగా పనులు సాగడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించాలని వారు కోరారు. లేకుంటే కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు.

నేడు ఖాసీంసాబ్ ఉత్సవాలు

కృష్ణా: మండలంలోని తంగిడిలో ఖాసీంసాబ్ ఉత్సవాలు నేటినుంచి ప్రారంభమవుతున్నట్లు దర్గ పూజారి సుభాష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం చిన్న సవారి, అగ్ని గుండం ప్రవేశం, అదే రోజు రాత్రి 12గంటలకు తంగిడి నుంచి గుర్జాల్ గ్రామంలో ఖాసీంసాబ్ దర్గా వరకు భక్తుల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఉత్సవాలకు ముంబాయి, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారన్నారు. అందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రైతు భరోసా విడుదల చేయాలి

ధన్వాడ: రైతులకు పెట్టుబడి సహాయం వెంటనే విడుదల చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాకం సురేందర్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెట్టుబడి సహాయం గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూన్‌లోనే విడుదల చేసేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పంటలు వేస్తున్న నేటికి విడుదల చేయకుండా రైతు రుణమాఫీ తరువాత విడుదల చేస్తామనడం వారిని ఇబ్బందులు పెట్టడమే అన్నారు. అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా మలుపు



మాగనూర్: మండలంలోని వర్కూర్ నుంచి నేరడగం గ్రామానికి వెళ్లే బీటీ రోడుపై పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణికులు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ మార్గంలో గతంలో చాలా ప్రమాదలు కూడా సంబవించిన అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతోపాటు తగిన జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గోరింటాకు సంబరం

నారాయణపేట రూరల్: పట్టణంలోని పర్మారెడ్డి కాలనీ మహిళలు శనివారం గోరింట పండగ జరుపుకున్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని పలువురు మహిళలు, ఆడపిల్లలు ఒకచోటకి చేరుకుని చేతులపై గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. వారు మాట్లాడుతూ.. ఆశాఢమాసం వచ్చిందంటే చాలు మహిళలు, ఆడ పిల్లలు తమ చేతులపై గోరింట డిజైన్లతో అలంకరణ చేసుకుంటారని అన్నారు. నెలరోజుల పాటు జరుపుకునే వేడుకలో అందంతో పాటు ఆరోగ్యం, ఆధ్యాత్మికం దాగిఉన్నాయని చెప్పారు.

దివ్యాంగ బాలుడికి వీల్‌చైర్ అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని గ్రంథాలయం వీధికి చెందిన సాత్విక్ అనే ఆరేళ్ల బాలుడు పుట్టుకతోనే అంగవైకల్యం ఉండటంతో నడవలేని స్థితిలో ఉన్నాడు. బాలుడి తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితిని 7వ వార్డు కౌన్సిలర్ నవీన్‌రెడ్డి దృష్టికి స్థానిక బీజేపీ కార్యకర్తలు తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన కౌన్సిలర్ నవీన్‌రెడ్డి సొంత ఖర్చులతో వీల్‌చైర్‌ను తెప్పించి శనివారం బాలుడి ఇంటికి వెళ్లి అందజేశారు. తమ కుమారుడికి వీల్‌చైర్ అందజేసేందుకు కృషి చేసిన స్థానిక బీజేపీ కార్యకర్తలకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, కొమ్ము సురేష్, రాఘవేంద్రగౌడ్, మహేష్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మహేష్‌చారి, వీరప్రభు, రవితేజ తదితరులు ఉన్నారు.

వీధికుక్కల తరలింపు

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో వీధికుక్కల తరలింపును చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శనివారం గుంటూరుకు చెందిన వారితో వీధికుక్కలను పట్టిస్తున్నామని, పట్టిన వీధి కుక్కలను అచ్చంపేట నల్లమల అడవుల్లో వదులుతున్నారని తెలిపారు. ఇందుకుగాను ఒక్క కుక్క పట్టేందుకు రూ.300ల చొప్పున చెల్లిస్తున్నామని, ఇది వరకు 150కుపైగా వీధి కుక్కలను పట్టుకున్నారని మరో నాలుగు రోజుల్లో పూర్తిస్తాయిలో కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు.





మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



ఎరుకలి గేరిలో ముళ్లకంప మధ్యలో ఇలా..



మక్తల్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో కంచె లేకుండా ..



బురాన్ గడ్డలో కట్టెలతో కంచెఏర్పాటు

పొంచి ఉన్న ప్రమాదం..

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్ల రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉండడంతో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులకు తెలిపినా ఏమాత్రం పట్టించుకోవడంలేదు. వాటి చుట్టూ కనీసం కంచెకూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అంటున్నారు.

పట్టణంలో ఆయాచోట్ల ఇలా..

- మక్తల్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల సమీప భాగంలో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. దానికి ఏమాత్రం కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎరుగలి గేరిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన ఫలితం లేకుండా పోయింది. అధికారులకు తెలిపిన పటించుకోవడంలేదు.
- స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు ఒకేచోట ఉన్న విద్యుత్ సరఫరాలో మాత్రం ప్రతిరోజు అంతరాయం ఏర్పడుతుంది. పక్కనే ఉన్న రోగులు బయందోళన చెందుతున్నారు.
- బురాన్ గడ్డలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న వాటికి కట్టెలు కట్టి కంచెను ఏర్పాటుచేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కనే ఉన్న అధికారులు చూసిచూడనట్లుగా వదిలేస్తున్నారు.
- మక్తల్‌లో అంబేద్కర్ చౌరస్తాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇళ్ల మధ్యలో ఉండటంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు. ఇలా చాలాచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

క్రీడలతో మానసిక ఉల్లాసం

నారాయణపేట రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ సర్పంచ్ కోట్ల సుగంధమ్మ అన్నారు. మండలంలోని జాజాపూర్ గ్రామానికి చెందిన కీశే కోట్ల శ్యాంసుధాకర్ జ్ఞాపకార్థం స్థానిక పాఠశాల ఆవరణలో శనివారం వాలిబాల్ పోటీలను నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనం నుంచి చదువుతోపాటు క్రీడలతో ప్రావిణ్యం సంపాదించాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటలో సైతం అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ జాజాపూర్, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ గుండుమాల్ జట్లు విజేతలుగా నిలిచారు. వారికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేష్, పీడీ నర్సింహులు, డీఎస్ఓ భానుప్రకాష్, రిటైర్డ్ పీఈటీ నర్సింహులు, వ్యాయామ ఉపాధ్యాయులు సాయినాథ్, రాజశేఖర్, రత్నయ్య, అనంతసేనా, అక్తర్‌పాషా, రమేష్, వెంకటప్ప, కనకప్ప తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కోట్ల సుగంధమ్మ

నేడు జిల్లా కేంద్రంలో విద్యుత్ అంతరాయం

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉప విద్యుత్ కేంద్రంలో 11 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహమ్మద్ రఫీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యసాయి ఫీడర్ కింద ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పర్మారెడ్డి కాలనీ, అశోక్‌నగర్, బజరంగదళ్ కాలనీ, బాబాకాలనీ, సివిల్ -2 కింద కలెక్టర్ బంగ్లా, ఎస్పీ బంగ్లా, ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీలు ఉన్నాయని తెలిపారు. సత్యసాయి ఫీడర్ కింద సివిల్ -1 ఫీడర్ పరిధిలో బస్సు డిపో, సాయివిజయ్ కాలనీ, సింగార్ బేస్‌కాలనీ, సరాఫ్ బజార్, దామరగిద్ద రోడ్, అగ్రహార్ పేట్ ఏరియా వస్తాయన్నారు. అలాగే యాదగిరి ఫీడర్ కింద ప్రతిభ కాలేజ్ బ్యాక్ సైడ్ ఏరియా శాతవాహనకాలనీ ఏరియా గురుకుల స్కూల్, సత్యనారాయణ టెంపుల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు, వ్యాపారస్తులు సహకరించాలని ఏఈ కోరారు.

పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

అమరచింత: పట్టణంలోని పోచమ్మ ఆలయ నూతన కమిటీని శనివారం ఆలయ ఆవరణంలో ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పోసిరిగారి విష్ణు, ఉపాధ్యక్షులుగా జింక రవి, రాజు, ప్రధాన కార్యదర్శిగా కురువ రఘు, కోశాధికారిగా తాటికొండ రమేష్, సలహాదారులుగా పెద్ద కిష్టన్న, కురువ గోపి, పెద్ద విమలన్న, కొత్తబాయి కురుమన్న, ఫకీరన్న, మంగ వెంకటన్నతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈనెల 23న పోచమ్మ బోనాల ఉత్సవం సందర్భంగా ఆలయ ఆవరణంలో పారిశుద్ధ్య పనులతో పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు పోసిరిగారి విష్ణు కోరారు. నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ శాలువాతో సత్కరించారు.



కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్

పీర్లపండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన మొహర్రం పీర్లపండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతసామరస్యాలకు అతీతంగా పీర్లపండుగను హిందూ, ముస్లింలు కలిసి జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రవీందర్, రాజ్‌కుమార్, ఖాజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీకాంత్

డ్రం సీడర్ సాగు పద్ధతిపై ఆసక్తి చూపాలి

మరికల్: వ్యవసాయ రంగంలో నూతన వరవడుల ద్వారా లాబాలను ఆర్జించడం కోసం రైతులు డ్రం సీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేయాలని ఏఓ శివ కుమార్, ఏఈఓ పరుశురాం శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఎకరాకు 8 నుంచి 10కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు. నారు పెంచి నాటు వేసే సమస్య ఉండదన్నారు. గంటన్నర సమయంలోనే ఎకరా పూర్తి చేయవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా తూర్పు, పడమర సాగు చేయడంతో ఎండ తగిలి తేగుళ్ల బెడద ఉండదన్నారు. ఇలా చేయడంతో ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి సాధించేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సొంత చేసుకునేందుకు రైతులు ఈ పద్ధతిపై మొగ్గు చూపాలన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం



మక్తల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం అధ్యక్షుడు గోపాలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీ ఆర్డర్లను ప్రభుత్వం నగదు రూపంలో ఇవ్వాలని, లైఫ్ సర్టిఫికెట్‌ను ఈ నెల చివరిగా ఎస్‌టీఓ ఆఫీసులో అందజేయాలని కోరారు. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం 300గజాల స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం పదవీ విరమణ పొందిన అరుణ, కృష్ణయ్య, చంద్రశేఖర్‌ను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాస్కర్, గౌరవ అధ్యక్షుడు సంజన్న, మౌలాన, మల్లికార్జున్, సిద్దిలింగయ్య, నర్సయ్య, సత్యనారాయణ, సూర్యప్రకాస్, లింగయ్య, శ్రీనివాసులు, విద్యావతి పాల్గొన్నారు.

కృష్ణానది నుంచి ఇసుక అక్రమ రవాణా

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో కృష్ణానది నుంచి ప్రతినిత్యం ఇసుక అక్రమ రవాణ కొనసాగుతు న్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం ఆ గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి రోజు రాత్రి అయితే చాలు నదిలోని ఇసుకను టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖలోని ఓ అధికారి ఈ అక్రమ ఇసుక రవాణకు సహకరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్యులు అదే సొంత ఇంటి నిర్మాణానికి ఇసుక అవసరం అంటే అనుమతులు ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు వేధిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం పెంపొందించుకోవాలి

ఊట్కూరు: ప్రతి సేవాభావం పెంపొందించుకోవాలని లయన్స్‌క్లబ్ డిస్టిక్ గవర్నర్ హరినారాయణ్ భట్టడ్ అన్నారు. శనివారం మండలంలోని లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంశీచికేతారెడ్డి, జనరల్ సెక్రటరీ వసంత్‌కుమార్, కో-శాధికారి నర్సింహారాజుగౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యా, వైద్య తదితర సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని ఆయన తెలిపారు. లయన్స్‌క్లబ్ ద్వారా భవిష్యత్‌లో మారుమూల గ్రామాల్లో సైతం సేవా కార్యక్రమాలు అందించాలని ఆయన తెలిపారు. అనంతరం ఆర్ఎంపీ డాక్టర్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు బసవప్ప, ఆత్మారాం ఎడీకే, అశోక్‌కుమార్ యాదవ్, విజయసింహారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఎల్కోటి జనార్ధన్‌రెడ్డి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంపీ డాక్టర్‌లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆలయ నిర్మాణానికి దాతల సహాయం

మరికల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సరస్వతీ ఆలయ నిర్మాణానికి దాతలు శనివారం తమవంతు ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని గౌతమ్ మాడల్ హైస్కుల్ కరస్పాడెంట్ రాజేందర్‌రెడ్డి రూ.11వేలు, గున్ముక్లకు చెందిన సూర్యప్రకాష్‌రెడ్డి రూ.10వేల చొప్పున ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆర్థిక సాయం చేసిన దాతలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో బసంత్, జగదీష్, రాములు, కృష్ణయ్య, నారాయణ, మహేందర్, రమేష్, కృష్ణయ్య, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



నిర్వాహకులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని వర్తింపచేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం కోరారు. శనివారం ఆత్మకూర్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ శివశంకర్, ఎస్ఐ నరేందర్ చేతులమీదుగా ఐడీ కార్డులను అందుకున్నారు. అధ్యక్షుడిగా మణ్యం, ఉపాధ్యక్షుడిగా నవీన శ్రీను, ప్రధానకార్యదర్శిగా తౌఫిక్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాములు నియమించారు. కార్యక్రమంలో జగన్‌గౌడ్, ఆరేపల్లి శ్రీను, నర్సింహులు, ప్రసాద్, లక్ష్మణ్, నరేష్, రంజీత్, ఖాజీ ఉన్నారు.



ఫొటోగ్రాఫర్లకు ఐడీ కార్డులు అందిస్తున్న సీఐ శివశంకర్

కస్తూర్బాలో చెత్త తొలగింపు

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ కస్తూర్బా పాఠశాలలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని శనివారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. శుక్రవారం సాయంత్రం మక్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి ఆకస్మికంగా సందర్శించి పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం చూసి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో గ్రామకార్యదర్శి మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో చెత్తను తొలగించడంతో పాటు ప్రతినిత్యం సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ శివలీల తదితరులు ఉన్నారు.



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొత్తకోట రూరల్: కొత్తకోట గ్రామ మాజీ సర్పంచ్ ధన్వాడ బాలసామి (85) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అదేవిధంగా వివేకానంద కాలనీకి చెందిన పాకనాటి నిరంజన్ (55) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శనివారం కొత్తకోటకు చేరుకుని చనిపోయిన వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతుబీమా చెక్కు అందజేత

పట్టణ కేంద్రంలోని అంబభవానీ కాలనీకి చెందిన దుప్పటి శ్రీనివాసులు 20రోజుల క్రితం మృతి చెందాడు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతుబీమా చెక్కు రావడంతో ఎమ్మెల్యే మృతుడి భార్య దుప్పటి నాగమ్మకు ఆ చెక్కును అందజేశారు. రైతుబీమా చెక్కు త్వరగా రావడానికి కృషి చేసిన అధికారులకు, స్థానిక కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మేస్త్రీ శ్రీనివాసులు, బోయేజ్, కృష్ణారెడ్డి, డాక్టర్ పీజే బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



నాగమ్మకు రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా

- పంచాయతీ కార్యాలయంలో వైద్యసేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జాధరావ్‌పల్లిలో పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న వైద్య సేవలు



జాధరావుపల్లిలో పూర్తయిన పల్లె దవాఖాన భవనం

మద్దూరు: మండలంలోని జాదరావ్‌పల్లి గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) నుంచి రూ.20 లక్షల నిధులతో పల్లె దవాఖానా భవన నిర్మాణ పనులు 2023లో ప్రారంభించారు. ఈ భవన నిర్మాణం పూర్తయి దాదాపు పదినెలలు గడుస్తున్నా ప్రారంభం చేయకపోవడంతో విధిలేని పరిస్థితిలో వైద్యసేవలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేస్తున్నారు. దీంతో ఇటు గ్రామ పంచాయతీ పనులకు, వైద్యసేవలకు ఇబ్బందిగా మారింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

జాదరావ్‌పల్లి గ్రామంలో పల్లెదవాఖానా ఏర్పాటు చేయడంతో జాధరావ్‌పల్లితండా, సీత్యానాయక్‌తండా, చింతల్‌దిన్నే, చింతల్‌దిన్నేతండా, దోరేపల్లి, గ్రామ పరిధిలోని 14 తండాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఈ భవనాన్ని ఇక్కడ నిర్మించారు. ప్రతిరోజూ ఆయుష్ డాక్టర్లు, ఈ గ్రామాలకు సంబంధించిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇక్కడి రావడంతో ప్రజలు కూడా వైద్యసేవల కోసం జాదరావ్‌పల్లికి వస్తున్నారు. ప్రతినిత్యం వైద్యసేవల కోసం ఈ గ్రామాల ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావడంతో పంచాయతీ పనులు చేసుకోవడానికి వీల్లేకుండా పోయిందని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. అలాగే అస్వస్థకు గురైన వారికి వైద్యం చేయడానికి మంచాలు, ఇతర పరికాలను ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది.

భవనం అప్పగించని అధికారులు

పీఆర్ అధికారులు ఈ భవనాన్ని నిర్మాణం చేపట్టారు. భవనం పూర్తయి పదినెలలు గడుస్తున్నా భవనాన్ని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించకపోవడంతో దాన్ని ప్రారంభోత్సవాన్ని నిర్వహించలేకపోయారు. సదరు కాంట్రాక్టరు బిల్లు రాకపోవడంతో అప్పగించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే భవనం పూర్తయి కూడా వైద్యసేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పల్లె దవాఖాన భవనం పూర్తయి దాదాపు పదినెలలు గడుస్తుంది. వైద్యసేవలు అందించడానికి డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ సేవలు అందుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తయిన భవనాన్ని ప్రారంభిస్తే మరింత మేరుగైన వైద్య సేవలు అందుతాయి.

– రాజశేఖర్, జాధరావ్‌పల్లి

తమకు అప్పగిస్తే ప్రారంభిస్తాం..

జాధరావ్‌పల్లిలో భవనం పూర్తయింది. కానీ ఇప్పటివరకు ఈ భవనాన్ని తమకు శాఖకు అధికారులు అప్పగించలేదు. దీంతో అందులో వైద్యసేవలు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగిస్తున్నాం. వెంటనే భవనాన్ని తమకు అప్పగిస్తే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రారంభించి వైద్యసేవలు ప్రారంభిస్తాం.

– శ్రీలత, మండల వైద్యాధికారిణి, మద్దూరు

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: మండలంలోని జూరాలకు చెందిన వడ్ల అంజనేయులు ఈనెల 3వ తేదీన జూరాల నుంచి ఆత్మకూర్‌కు బైక్‌పై వస్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం బాధితుడికి ఫోన్ అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ పేర్కొన్నారు.